క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజలందుకున్న లక్ష్మీనరసింహస్వామి

తాడిమర్రి: స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ పూజారి స్వామి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పలు రకాల పుష్పమాలలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు స్వామికి కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేసి మొక్కులు తీర్చు కున్నారు. ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామి, లక్ష్మీదేవి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు పల్లకీలో స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు.

బత్తలపల్లిలో భారీ వర్షం

బత్తలపల్లి: మండలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. మండలవ్యాప్తంగా 43.4 మిల్లీ మీటర్లుగా నమోదైనట్లు ఏఎస్‌ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ శనివారం తెలిపారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి ఇంత వరకూ పదును వర్షం కురవకపోవడంతో రైతులు నిరాశకు గురయ్యారు. ప్రస్తుతం కురిసిన వర్షం వరి సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. వేరుశనగ సాగు చేయలేకపోయిన రైతులకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ విత్తనాలను సరఫరా చేయాలని కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

తనకల్లు: మారప్పగారిపల్లికి చెందిన ఓ యువకుడు విష శనివారం ద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గ్రామానికి చెందిన ఆనంద్‌పని ఉందని ఇంట్లో వాళ్లకి చెప్పి బయటకు వచ్చాడు. ఎం జరిగిందో తెలియదు కాని కూల్‌డ్రింక్‌లో విష ద్రావకాన్ని కలుపుకొని తాగి అపస్మారకస్థితిలో పడిపోయాడు. వందే మాతరం టీం సభ్యులు ఆనంద్‌ని తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం


ప్రపంచ ఆదివాసి దినోత్సవంలో పాల్గొన్న అధికారులు

తనకల్లు: మండలంలోని సీజీ ప్రాజెక్టు వద్ద ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో శనివారం ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామానాయక్ మాట్లాడుతూ గిరిజన బాలబాలికలు బాగా చదవి ఉన్నత స్థానానికి చేరుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మేరి మార్గెట్, వైస్ ప్రిన్సిపాల్ పారేసునాయక్, గిరిజన సంఘం మండల నాయకులు ప్రభాకర్ నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు


గాయపడిన నాగేంద్ర

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు.. చెన్నేకొత్తపల్లికి చెందిన నాగేంద్ర అనే యువకుడు తన తండ్రితో కలసి ద్విచక్ర వాహనంలో పొలం వద్దకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో జాతీయ రహదారిపై అదుపుతప్పి కింద పడటంతో తలకు గాయాలయ్యాయి. వెంటనే గాయపడిన వ్యక్తిని మరో వాహనంలో చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

స్నేహపూర్వక క్రికెట్ టోర్నమెంట్


విజేత జట్లకు షీల్డ్‌ను ప్రదానం చేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ జయంతి సందర్భంగా స్థానిక ఎస్టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల స్నేహపూర్వక క్రికెట్ టోర్నమెంట్ రెండోరోజైన శనివారం ఎన్పీకుంట–2 జట్టుపై ధర్మవరం జట్టు గెలిచింది. రెండోమ్యాచ్‌లో గోరంట్ల జట్టుపై ముదిగుబ్బ జట్టు గెలుపొందింది. మూడవ మ్యాచ్‌లో తలుపుల జట్టుపై ధర్మవరం జట్టు విజయం సాధించింది. క్రికెట్ పోటీల్లో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తాహిర్‌వలీ, ఏపీటీఎఫ్ సురేంద్ర, లస్కర్‌నాయక్, శ్రీనివాసులు, ఆజం, రుద్రంరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

ధర్మవరం రూరల్: ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వన్ టౌన్ సీఐ పి. నాగేంద్రప్రసాద్ సూచించారు. శనివారం రాత్రి స్థానిక శివానగర్ రామాలయం వద్ద ప్రజలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న ఈవ్ టీజింగ్, అనుమానస్పద వ్యక్తులు, శక్తి టీమ్, డయిల్ 112,100 తదితర వాటిపై అవగాహన కల్పించారు.

చెరువులకు హంద్రీ-నీవా నీరు చేరేనా?

- నీరు లేక వట్టిపోయిన చెరువులు
- అడుగంటిన భూగర్భ జలాలు
- బీడుగా ఆయకట్టు భూములు
- తాగునీటికీ ఇబ్బందే


నీరు లేకపోవడంతో కంపచెట్లతో నిండిన తనకల్లు చెరువు

తనకల్లు: అసలే మెట్ట ప్రాంతం. వర్షాలు సక్రమంగా కురిస్తేనే పంటలు. లేకుంటే తాగునీటికి కూడా ఇబ్బందులే. ఈ పరిస్థితిని గుర్తించిన గత ప్రభుత్వం మండలంలోని దాదాపు అన్ని చెరువులకు హంద్రీ-నీవా జలాలతో నింపింది. దీంతో చెరువులకు జలకళ వచ్చింది. చెరువుల కింద ఉన్న అయకట్టు భూములు పంటలతో కళకళలాడేవి. గ్రామాలలో తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా మండలంలోని చెరువులకు ఇంతవరకు హంద్రీ-నీవా జలాలు చేరలేదు. చెరువులలో చుక్క నీరు లేదు. ఆయకట్టు భూములు బీడు భూములుగా మారాయి. చాలా గ్రామాలలో తాగు నీటి కోసం ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు.

వందల ఎకరాల ఆయకట్టు..

మండలంలో దాదాపు 70కి పైగా చెరువులున్నాయి. ఈ చెరువుల కింద వందల ఎకరాలు ఆయకట్టు భూములున్నాయి. వరి, టమాట, మొక్కజొన్న పంటలను ఎక్కువగా పండిస్తారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏటా చెరువులను హంద్రీ-నీవా నీటితో నింపారు. దీంతో చుట్టుపక్కల బోర్లలో నీరు పుష్కలంగా ఉండేది. తాగు, సాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. చెరువుల్లో నీరు బాగా ఉండడంతో ఆయకట్టు భూములలో వివిధ పంటలను సాగు చేసుకొనేవారమని రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

కూటమి ప్రభుత్వంలో చుక్కనీరు లేదు..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత హంద్రీ-నీవా జలాలను చెరువులకు మళ్లించలేదు. దాదాపు రెండేళ్లుగా చెరువుల్లో నీరు లేకపోవడంతో ఆయకట్టుదారులు పంటలను పండించలేదు. చెరువులతో పాటు ఆయకట్టు భూములన్నీ పిచ్చిమొక్కలు, ముళ్లచెట్లతో నిండిపోయాయి. చెరువులకు హంద్రీ-నీవా జలాలతో నింపితే రైతులకు, ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. చెరువులకు హంద్రీ-నీవా నీటిని అందిస్తే ఆయకట్టు రైతులకు కొండంత ఆసరా ఉంటుంది. వలస పోవాలన్న మాట ఎక్కడా లేకుండా రైతులు మరో పది మందికి ఉపాధి కల్పించే పరిస్థితి ఉంటుంది. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపి హంద్రీ-నీవా జలాలు చెరువులకు అందేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

సాగు, తాగునీటితో ఇబ్బంది ఉండదు



గత ప్రభుత్వం మాదిరిగా చెరువులకు హంద్రీ-నీవా జలాలను అందించాలి. దీని వల్ల సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బందీ ఉండదు. ఆయకట్టు భూముల్లో పంటలను సాగు చేసుకోవచ్చు. అలాగే పరిసర బోర్లలో నీరు ఉంటుంది. గ్రామాలలో తాగునీటికి ఇబ్బంది ఉండదు. ప్రజా ప్రతినిధులు హంద్రీ-నీవా జలాలు చెరువులకు చేరేలా చర్యలు తీసుకోవాలి.

–సునీల్‌కుమార్‌రెడ్డి, రైతు, ఈతోడు, తనకల్లు మండలం

హంద్రీ-నీవా నీటితో చెరువులు నింపాలి



గత ప్రభుత్వంలో అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మా గ్రామంలోని చెరువుకు హంద్రీ-నీవా జలాలతో నింపారు. చెరువు నిండా నీరు ఉండడంతో మా గ్రామంలోని రైతులు ఆయకట్టు భూములలో పంటలను పండించేవారు. ప్రస్తుతం మా చెరువులో నీరు తగ్గిపోయింది. దీంతో పంటలు సాగు చేయడానికి రైతులు ముందుకు రావడం లేదు. హంద్రీ-నీవా నీటితో చెరువుకు నింపి రైతులను ఆదుకోవాలి.

–నాగరాజు, సర్పంచ్, దిగువ చెక్కవారిపల్లి, తనకల్లు మండలం

చెరువులు నింపితే సస్యశ్యామలం



మండలంలోని అన్ని చెరువులకు హంద్రీ-నీవా జలాలతో నింపితే ఈ ప్రాంతం సస్యశ్యామలంగా ఉంటుంది. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే బోర్లలో నీటి మట్టం తగ్గుతోంది. చెరువులకు నీరు అందిస్తే నీటి మట్టం పెరగడంతో పాటు రైతుల పంటల సాగుకు అనుకూలమవుతుంది. దీంతో రైతులకు సాగునీటికి, ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదు.

– శివన్న, రైతు సంఘం నాయకులు, తనకల్లు

భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం


వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏడు శనివారాల వ్రతం చేస్తున్న మహిళలు


పల్లకీపై స్వామిని ఊరేగిస్తున్న గోవింద మాలధారణ కమిటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో నున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసం శనివారం సందర్భంగా మహిళలతో ఏడు శనివారాల వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి మూలవిరాట్‌ను అర్చకులు రాజేష్ వివిధ రకాల పూలు, తులసి ఆకులు, పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. మహిళలు ఏడు శనివారాల వ్రతాన్ని ఆచరించారు. ఆలయ కమిటీ సభ్యులు చెన్నంశెట్టి జగదీష్, జింకా రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి జయంతి వేడుకలు

శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి జయంతి సందర్భంగా కొత్తపేట, శ్రీనివాసనగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయాలకు వెళ్లి పూజలు చేపట్టారు. ఇదిలా ఉండగా తేరుబజార్‌లోనున్న శ్రీరామ భజన మందిరంలో శ్రావణ పౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా శనివారం తిరుమంజనసేవ, ప్రత్యేక పూజలు జరిగాయి. గోవింద మాలధారణ సేవా కమిటీ సభ్యులు దేవతా కృష్ణమూర్తి, కోటి లక్ష్మీవెంకటేశ్వర్లు, సుఖానంద తదితరులు శ్రీ భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకిపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం పౌర్ణమి గరుడసేవను ఘనంగా నిర్వహించారు. లక్ష్మీచెన్నకేశవ స్వామి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు, అడహక్ కమిటీ ఛైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇదిలా ఉండగా మార్కెట్‌యార్డు సమీపంలోనున్న రమణ మహర్షి ఆశ్రమంలో నిర్వాహకులు చిప్పల వెంకప్ప ఆధ్వర్యంలో పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులకు అన్నదానం చేశారు.

నీటి మడుగు కాదు.. రోడ్డే


ఒంటికొండలో ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని ఒంటికొండ గ్రామంలో ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలవడంతో నీటి మడుగును తలపిస్తోంది. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు ఒంటికొండ నుంచి మేడాపురం వెళ్లే ప్రధాన రహదారిపై వర్షపు నీరు చేరుతోంది. స్థానిక ప్రజలతో పాటు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దోమలు పెరిగి రోగాలు ప్రబలే ప్రమాదం ఉంది. అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక చొరవ చూపి నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వ్యక్తికి గాయాలు

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ సమీపంలో బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తికి గాయపడ్డాడు. ముదిగుబ్బలోని చెలిమి బావి వీధిలో నివాసం ఉంటున్న న వీస్ ద్విచక్ర బైక్‌పై వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడి కాళ్లకు గాయాలు కావడంతో స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఘనంగా రాఖీ పండుగ


మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి రాఖీ కడుతున్న మహిళా నేత సాయిలీల


ఆర్‌జె.రత్నాకర్ రాజు రాఖీ కడుతున్న బాలవికాస్ చిన్నారి

పుట్టపర్తి టౌన్: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.అక్కాచెల్లెళ్లకు తన సోదురులకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించాచి ఆశీర్వాదాలు పొందారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి రాష్ట్ర మహిళా కార్యదర్శి సాయిలీల, కౌన్సిలర్ సాయిగీత మహిళా నేత కవిత రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలను గౌరవభావంతో చూడడమే రక్షాబంధన్ అసలైన పరమార్థమన్నారు. ప్రతి వ్యక్తి తన సోదరీమణులను కాపాడుకోవాలన్నారు.

ప్రశాంతి నిలయం: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని బాలవికాస్ చిన్నారులు శనివారం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ కార్యాలయంలో మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజుకు రాఖీలు కట్టారు.

ధర్మవరం: పట్టణంలోని సాయినగర్‌లోనున్న లయోలా ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శనివారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏపీయూఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు అన్నం అరవింద్ పాఠశాలలోని విద్యార్థులకు రక్షాబంధన్ విశిష్టతను వివరించారు. అనంతరం విద్యార్థులకు సూర్యనమస్కారాలు యోగ అభ్యసనం చేయించారు. లయోలా పాఠశాల కరస్పాండెంట్ శంకర్ నాయుడు, ఉపాధ్యాయులు చంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ప్రజాపిత బ్రహ్మ కుమారి ఈశ్వరీయ విద్యాలయం నిర్వాహకురాలు రాధక్క ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ మాస్టర్, సిబ్బంది, ప్రభుత్వ ఆసుపత్రిలోని సిబ్బందికి రాఖీలు కట్టారు.

బత్తలపల్లి: మండల వ్యాప్తంగా శనివారం రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. రాఖీ శుభగడియలు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి శనివారం మధ్యాహ్నం 1.24 వరకు ఉంటాయని పండితులు చెప్పడంతో మధ్యాహ్నం వరకు చిన్నారులు ఒకరినొకరు రాఖీలు కట్టుకున్నారు. అనంతరం ఆలయాలకు వెళ్లి పూజ లు నిర్వహించారు. రాఖీ కట్టించుకున్న ప్రతి సాదరుడు తమ సోదరికి ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా బహుమతులను, నగదును, వస్త్రాలను అందజేయడం విశేషం.

సోదర భావానికి ప్రతీక 'రాఖీ పౌర్ణమి'

కనగానపల్లి: సోదర భావానికి ప్రతీకగా జరుపుకొనే రాఖీ పండుగను శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అన్నా తమ్ముళ్లకు అక్కాచెల్లెల్లు రాఖీలు కట్టి వారి ఆశీస్సులు తీసుకున్నారు. పలు పాఠశాలలు, కళాశాలల వద్ద విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు తమ సోదరా భావాన్ని చాటుకున్నారు. ఇక రాఖీ పౌర్ణమి సందర్భంగా పలు దేవాలయాల్లో పూజలు నిర్వహించారు.

ఘనంగా మహేష్‌బాబు జన్మదిన వేడుకలు


రక్తదానం చేస్తున్న అభిమానులు

కదిరి టౌన్: పట్టణంలో సినీహీరో సూపర్‌స్టార్ మహేష్ బాబు జన్మదిన వేడుకలు ఆయన అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ పట్టణాధ్యక్షుడు అల్లాబకాష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాదాపు 100 మంది యువకులు రక్తదానం చేశారు. మహేష్ బాబు 4,500 మంది చిన్నారులకు ఉచిత గుండె చికిత్సలు చేయించారని, అభిమానులు ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని అల్లాబకాష్ కోరారు. కార్యక్రమంలో అభిమానులు సూరి, రమేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

పవన పుత్రా.. పాహిమాం


శ్రీఖాద్రీ ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు


అలంకరణలో పాలపాటిదిన్నె అంజన్న


పూజలందుకున్న సైదాపురం ఆంజనేయుడు

కదిరి టౌన్: శ్రావణ మాసం మూడో శనివారం సందర్భంగా పట్టణంలోని సైదాపురం అంజనేయ స్వామి, ద్వారకా అంజనేయ, పంచముఖ అంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అర్చకులు ఖాద్రీశునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

నల్లచెరువు: శ్రావణమాసం మూడో శనివారం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కదిరి ఆర్డీఓ వీవీఎస్ శర్మ, ఆర్టీసీ డీఎం మైనుద్దీన్, కదిరి రూరల్ సీఐ నాగేంద్ర తదితరులు స్వామిని దర్శించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అధికారులు ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు.

ఎన్పీకుంట: శ్రావణమాసం మూడవ శనివారాన్ని పురస్కరించుకొని మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రంతో పాటు ధనియానిచెరువు, పెడబల్లి, పి కొత్తపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. భక్తులకు అన్నదానం చేశారు.

బత్తలపల్లి: పోట్లమర్రి ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మాసం మూడో శనివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు కొమందూరు మారుతిప్రసాద్, రమేష్, సాయిక్రిష్ణ ఆధ్వర్యంలో తెల్లవారుజామున నుంచి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆకుపూజ నిర్వహించి భజనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ముష్టూరు, మాల్యవంతం, వేల్పుమడుగు గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఓడీచెరువు: మండల కేంద్రంలోని అభయాంజనేయస్వామి, ఎం.బి. క్రాస్‌లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నదానం చేపట్టారు.

కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

తనకల్లు: కౌలు రైతులకు గుర్తింపు కార్డులను అందజేయాలని కౌలు రైతుల సంఘం జిల్లా నాయకులు చౌడప్పయాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో మనోహర్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతుల రక్షణ–సంక్షేమం కోసం వెంటనే పమగ్రమైన కౌలు చట్టాన్ని అమలు చేయాలన్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రూ. 2 లక్షల వరకు హామీ లేని పంట రుణాలను మంజూరు చేయాలన్నారు. ఆత్మహత్యలకు పాల్పడిన కౌల రైతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నేత భూషణ పాల్గొన్నారు.

మత్తు జోలికెళ్లొద్దు

నల్లమాడ: విద్యార్థులు మత్తు జోలికి వెళ్లకుండా భవిష్యత్తుపై దృష్టి సారించాలని వక్తలు సూచించారు. స్థానిక కస్తూర్బా, ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలలో శనివారం మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈగల్ టీం ఇన్‌చార్జ్ శ్రీహరి, శక్తి టీం ఇన్‌చార్జ్ గోపీనాథ్ రెడ్డి, సీఐ నరేంద్రరెడ్డి, ఎంఈఓ వేమనారాయణ డ్రగ్స్, బాల్య వివాహాలు, ర్యాగింగ్, ఫోక్సో, మహిళా చట్టాలను తెలియజేశారు. విద్యార్థులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం

పుట్టపర్తిటౌన్: పుట్టపర్తి సబ్ డివిజన్‌లో రాత్రి సమయాల్లో చోరీల నియంత్రణకు గస్తీ ముమ్మరం చేస్తున్నట్లు డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతి ఒక్కరూ విలువైన వస్తువులు, పెద్ద మొత్తాలను బ్యాంకుల్లో దాచుకోవాలని సూచించారు. ఊళ్లకు వెళ్లేటప్పుడు ఇంట్లో, బయట లైట్లు వేయాలని, ఇంటి బయట సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. పోలీసులకు ముందస్తు సమాచారం ఇస్తే రాత్రి వేళల్లో గస్తీలు నిర్వహిస్తామని తెలిపారు. మహిళలు వాకింగ్, ఇంటి ముందు ముగ్గు వేసే సమయంలో మెడలో బంగారు నగదు వేసుకోకపోవడం మంచిదని పేర్కొన్నారు.

శుభకార్యం


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి దంపతులు

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యవసాయి సలహా మండలి మాజీ ఛైర్మన్ అవుటాల రమణారెడ్డి కుమారుడు పవన్‌కుమార్‌రెడ్డి, జగరాజుపల్లి కి చెందిన మురళీధర్‌రెడ్డి కమార్తె జ్యోతి వివాహం శనివారం బీడుపల్లి గ్రామం వద్ద ఉన్న అభయాంజనేయస్వామి కల్యాణమండంలో జరిగింది. ఎమ్మెల్సీ మంగమ్మ, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి శంకర నారాయణ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, సిద్దారెడ్డి, తిప్పేస్వామి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ సలహాదారు అంబటి కృష్ణారెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ మంటిడుగు కేశవరెడ్డి, మాజీ ఛైర్మన్ శివశంకర్‌రెడ్డి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ నళిని రంగేగౌడ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొత్తకోట సోమశేఖర్‌రెడ్డి, గశిగవారిపల్లి రమణారెడ్డి, కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

'వస్తా నీ వెనుక' షూటింగ్ ప్రారంభం


చిత్రానికి క్లాప్ కొడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి టౌన్: అంచి వెంకటేశులు దర్శకత్వంలో ఏజీ క్రియేషన్స్ బ్యానర్‌పై జయరామిరెడ్డి సమర్పించు వస్తా నీ వెనుక చిత్రం ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రారంభమైంది. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. కదిరి, పుట్టపర్తి, తిరుపతి, మదనపల్లి, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో చిత్రీకరించనున్నట్లు నిర్మాతలు అజ్జుగుంట సౌజన్యరెడ్డి, అజ్జుగుంట బాబు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. లిఖితేశ్వర్‌రెడ్డి, మనోజ్ఞ హీరో, హీరోయిన్లు పరిచయమవుతున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలను కాలరాస్తున్న ప్రభుత్వాలు


మాట్లాడుతున్న ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మొండి నందకిశోర్

ధర్మవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ విలువలను కాలరాస్తున్నాయని ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు మొండి నందకిశోర్ విమర్శించారు. పట్టణంలోని ప్రభుత్వ బీసీ హాస్టల్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ 1942 ఆగస్టు 9న క్విట్ ఇండియా పేరుతో ప్రారంభించిన ఉద్యమం నేటికి 83 ఏళ్లు పూర్తయిందన్నారు. ఈ సందర్భంగా నేటి యువత ఆ ఉద్యమ స్ఫూర్తితో భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని తెలిపారు. పీఎస్‌యు నాయకులు మోహిత్, మనోజ్‌కుమార్, ఉమాకాంత్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

13, 14 తేదీల్లో రైల్వేగేటు మూసివేత

ముదిగుబ్బ: గుంజేపల్లి సమీపాన ఉన్న కృష్ణాపురం రైల్వే గేటును ఈ నెల 13, 14 తేదీల్లో మూసివేయనున్నట్లు ఆ శాఖ సీనియర్ ఇంజినీర్ శివమ్ మతూర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.